కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ అఫ్ న్యూ భారత్

కష్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

సంపుటి - 01 సంచిక -190 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ 22-07-2026 బుధవారం పేజీలు : 4

# ఆదాయానికి అండ!



## హైడ్రా తరహాలో కొత్త వింగ్

- ఆదాయ లీకేజీలపై ఉక్కుపాదం
- అవినీతి అధికారులపై వేట
- పన్ను ఎగవేతకు చెక్
- స్వతంత్ర నిఘా వ్యవస్థ ఏర్పాటు
- ఐపీఎస్ అధికారికి బాధ్యతలు
- ఆధునిక టెక్నాలజీతో నిఘా
- వారం రోజుల్లో కార్యాచరణ
- ఖజానాకు వేల కోట్ల ఆదాయం

**న్యూస్ డెస్క్, 21 జూలై (బిఎన్ఎస్):** రాష్ట్ర ఆదాయానికి గండి కొడుతూ, ఖజానాను గుల్ల చేస్తున్న అక్రమార్కులు, అవినీతి అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం సమాయత్తమవుతోంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల అభివృద్ధికి నిధుల కొరత రాకుండా ఉండాలంటే ఆదాయ వనరులను పెంచుకోవడమే కాకుండా.. అందులో జరుగుతున్న అక్రమాలను అరికట్టడం అత్యంత కీలకమని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ భూముల ఆక్రమణల నిరోధానికి ఏర్పాటు చేసిన హైడ్రా, మాదకద్రవ్యాల నిర్మూలనకు తీసుకొచ్చిన ఈగల్ తరహాలోనే... రాబడి పెంచే శాఖల్లో జరిగే లీకేజీలను అరికట్టడానికి ప్రత్యేకంగా స్టేట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం నెలకొల్పాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు.

సోమవారం సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ ఆనంద్, సీఎంవో ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సుదీర్ఘంగా సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రానికి రావలసిన వాస్తవ ఆదాయం ఆశించిన స్థాయిలో రాకపోవడంపై సీఎం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

మిగతాది 2 లో..

# మరోసారి పార్లమెంట్ ముట్టడి యత్నం

- జంతర్ మంతర్‌లో హైటెన్షన్
- ధర్మేంద్ర రాజీనామాపై పట్టుదల
- వాంగ్‌చుక్ దీక్ష కొనసాగింపు
- పోలీసుల భారీ బందోబస్తు
- గాయపడిన యువతకు పరామర్శ
- కోచింగ్ సెంటర్లపై సీజేపీ ఫైర్



2 లో

**న్యూస్ డెస్క్, 21 జూలై (బిఎన్ఎస్):** నీట్ ప్రశ్నాపత్రం లీకేజీకి బాధ్యత వహిస్తూ కేందర్ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆదోళన మంగళవారం సైతం కొనసాగుతోంది. సోమవారం సీజేపీ ఇచ్చిన చలో పార్లమంట్ పిలుపు తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసినా ఆందోళన కారులు వెనక్కి తగ్గడం లేదు. మంగళవారం మరోసారి పార్లమెంట్ ముట్టడికీ సేజీపీ ప్రయత్నించింది. పార్లమెంట్ వైపు వెళ్తున్న నిరసనకారులను పోలీసులు అడ్డుకున్నారు. సోమవారం పోలీసులు జరిపిన లాఠీచార్జిలో గాయపడిన యువతను మంగళవారం సీజేపీ నేతలు జంతర్ మంతర్ వద్దకు తీసుకువచ్చారు.

# వక్ఫ్ బోర్డుకు సుప్రీం ఊరట



2 లో

# రెబల్స్‌కు నో ఎంట్రీ



2 లో

- పార్టీలోకి మళ్లీ ప్రవేశం లేదు
- బీజేపీపై ఐక్య పోరాటానికి పిలుపు
- సీజేపీ ఆందోళనలకు టీఎంసీ మద్దతు
- వేదిక ధ్వంసంపై బీజేపీపై ఆరోపణలు
- అభిషేక్ బెనర్జీ సంచలన సవాల్
- బెంగాల్ రాజకీయాల్లో వేడెక్కిన పోరు

# ఢిల్లీ విధ్వంసంపై కేసు నమోదు

- కనాట్ ప్లేస్‌లో కేసులు
- 70 మంది అదుపులోకి
- 118 మంది పోలీసులకు గాయాలు
- రాళ్లదాడి వీడియో విడుదల
- తప్పుడు ప్రచారంపై హెచ్చరిక
- సీసీటీవీ ఆధారాలతో విచారణ



2 లో

**న్యూస్ డెస్క్, 21 జూలై (బిఎన్ఎస్):** కాక్‌రోచ్ జనతా పార్టీ చేపట్టిన 'చలో పార్లమెంట్' ఢిల్లీలోని జంతర్ మంతర్, పార్లమెంట్ వీధి పరిసరాల్లో ఆందోళన తీవ్ర హింసాత్మకంగా మారిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై ఢిల్లీ పోలీసులు మంగళవారం కఠిన చర్యలు చేపట్టారు. నిరసనకారులు బారికేడ్లు తోసుకుంటూ వచ్చి రాళ్ల దాడికి పాల్పడటం, ప్రభుత్వ వాహనాలను ధ్వంసం చేయడం, పోలీసుల హెల్మెట్, జాకెట్లు లాక్కోవడం వంటి

# భగ్గుమన్న రైతాంగం



2 లో

- ఢిల్లీ చలో మార్చ్‌తో ఉద్రిక్తత
- శంభూ బార్డర్ వద్ద రైతుల ఆందోళన
- హర్యానా సరిహద్దులు పూర్తిగా మూసివేత
- భారీ బారికేడ్లు.. వాటర్ కేనన్ల మోహరింపు
- అమెరికా వాణిజ్య ఒప్పందంపై రైతుల నిరసన
- ఢిల్లీలో హై అలర్ట్.. ట్రాఫిక్ ఆంక్షలు
- హింసాత్మక పరిస్థితులపై అధికారుల అప్రమత్తత

# హస్తినలో హైటెన్షన్



2 లో

- మోదీ నివాసం ఎదుట ధర్నా
- కాంగ్రెస్ భారీ నిరసన
- రాహుల్, ప్రియాంక బైఠాయింపు
- నీట్ అక్రమాలపై ఆందోళన
- ప్రభుత్వంపై నినాదాల హోరు
- ఖర్గే నేతృత్వంలో ర్యాలీ
- సిద్ధరామయ్య సంఘీభావం

**న్యూస్ డెస్క్, 21 జూలై (బిఎన్ఎస్):** దేశ రాజధాని ఢిల్లీలో పొలిటికల్ హీట్ తారాస్థాయికి చేరింది. ఇటీవల చోటుచేసుకున్న విద్యార్థుల నిరసనలు, పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీలు, తీవ్ర అవకతవకలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలు తీవ్ర స్థాయిలో నిరసనకు దిగారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసం నుంచి ప్రధాని నరేంద్ర మోడీ అధికారిక నివాసం వైపు కాంగ్రెస్ నేతలు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. అయితే, ర్యాలీగా వెళ్లిన కాంగ్రెస్ ఎంపీలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు పలువురు సీనియర్ నాయకులు ప్రధాని నివాసం ఎదుటే రహదారిపై బైఠాయించి ధర్నా చేపట్టారు. మోదీ ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రధాని నివాస ప్రాంతం అంతా.. 'తానాషాహీ నహీ చలేగీ', 'మోదీ ఇస్తీఫా దో' అనే నినాదాలతో హోరెత్తుతోంది.


# నీట్‌పై మోడీ కీలక వ్యాఖ్యలు

- విద్యార్థుల ప్రయోజనాలే ప్రభుత్వ ప్రాధాన్యం
- పేపర్ లీక్ నిందితులకు కఠిన శిక్ష తప్పదు
- అత్యుత్తమ న్యాయవాదులతో కేసు పోరాటం
- లీకేజీల నివారణకు పటిష్ట వ్యవస్థ ఏర్పాటు
- కేంద్ర-రాష్ట్రాల సమన్వయంపై ప్రధాని పిలుపు
- ఎన్డీఏ సమావేశంలో పరీక్షలపై కీలక చర్చ

2 లో

# 4 వేల ఏళ్ల చారిత్రక వైభవం

- యునెస్కో దృష్టిలో ముడుమాల్
- స్టోన్‌హెంజ్ తరహా నిలువురాళ్లు
- ఖగోళ రహస్యాలకు నిలయం
- ఏఎస్ఐ తవ్వకాలకు గ్రీన్ సిగ్నల్
- శాశ్వత గుర్తింపుకు కసరత్తు
- తెలంగాణకు మరో ప్రపంచ వారసత్వం



2 లో

**న్యూస్ డెస్క్, 21 జూలై (బిఎన్ఎస్):** రాష్ట్రంలోని మరో పురాతన చారిత్రక కట్టడానికి యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో గుర్తింపు దక్కే అవకాశం ఉంది. 2021లో రామప్ప ఆలయానికి ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు దక్కింది. అలాగే నారాయణపేట జిల్లా కృష్ణ మండలం ముడుమాల్ గ్రామంలో సుమారు నాలుగేళ్ల నాటి నిలువురాళ్ల(మెగాలిథిక్ యుగం)కు గతేడాది మార్చిలో ఆ జాబితాలో చోటుదక్కింది. ఇక్కడి రాళ్లకు ఖగోళ, పురాతన చారిత్రిక, సాంస్కృతిక ప్రాముఖ్యం ఉంది.

# టన్నెల్‌లో ఘోర ప్రమాదం

- 10కు చేరిన మృతుల సంఖ్య
- టన్నెల్‌లో కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్
- ఇంకా పలువురు కార్మికుల ఆచూకీ గల్లంతు
- మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా
- క్షతగాత్రులకు రూ.50 వేల ఆర్థిక సాయం
- మోదీ, అమిత్ షా తీవ్ర దిగ్భ్రాంతి
- సహాయక చర్యలకు కేంద్రం పూర్తి సహకారం

2 లో

# మన ఇల్లు - మన లోకేశ్

- 3 వేలమందికి ఇళ్ల పట్టాల పంపిణీ
- రూ.1000 కోట్ల ఆస్తి పేదల సొంతం
- శాశ్వత భూ హక్కులతో భరోసా
- మంగళగిరి అభివృద్ధే నా లక్ష్యం
- నంబర్-1 నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా
- అభివృద్ధి-సంక్షేమం జోడెద్దుల్లా
- త్వరలో మరిన్ని అభివృద్ధి పనులు

2 లో

# మరోసారి పార్లమెంట్ ముట్టడి యత్నం

మొదటి పేజీ తరువాయి

గాయపడిన వారిని సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే పరామర్శించారు. సోమవారం ఉద్రిక్తతల నేపథ్యంలో జంతర్ మంతర్ వద్ద సీజేపీ నిరసన స్థలాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అయితే వాటిని పట్టించుకోని యువత మంగళవారం మరోసారి జంతర్ మంతర్ వద్దకు భారీగా చేరుకుంటున్నారు. ఓ వైపు పార్లమెంట్ సమావేశాలు కొనసాగుతున్న వేళ సీజేపీ ఆందోళనల పట్ల అప్రమత్తంగా ఉన్న పోలీసులు జంతర్ మంతర్ వద్ద భారీగా మోహరించారు. ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేసేవరకు నిరసన ఆగదని సీజేపీ మరోసారి స్పష్టం చేసింది.

కొనసాగుతున్న వాంగ్ చుక్ నిరాహార దీక్ష:

నిన్న ఆందోళనకారులపై పోలీసులు దాడి చర్య తర్వాత సోనమ్ వాంగ్ చుక్ తన ఉపవాస విరమణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నట్లు సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే తెలిపారు. మంగళవారం జంతర్ మంతర్ వద్ద మీడియాతో మాట్లాడిన దీప్కే.. సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యం చాలా క్షీణించిందని, పరిస్థితి ఇలాగే కొనసాగితే అవయవాలు దెబ్బతినే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరించారు. దాంతో దీక్ష విరమించేందుకు తాము తీవ్రంగా ప్రయత్నించామని ఈ క్రమంలో మూడు షరతులను నెరవేరిస్తే దీక్ష విరమించేందుకు సోనమ్ వాంగ్ చుక్ సిద్ధమయ్యారు. కానీ సోమవారం యువతపై పోలీసుల క్రూరమైన దాడి చూశాక సోనమ్ వాంగ్‌చుక్ తన నిరాహార దీక్షను ఆపాలనుకున్న నిర్ణయాన్ని విరమించుకుని దీక్ష కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

కోచింగ్ సెంటర్లపై ఆగ్రహం:

ఇదిలా ఉంటే విద్యార్థుల ఆందోళనకు మద్దతు తెలపని కోచింగ్ సెంటర్లు, టీచర్లను బహిష్కరించాలని కాక్రోచ్ జనతా పార్టీ ఎక్స్ ఖాతాలో కోరింది. విద్యార్థులకు మద్దతుగా నిలవని ప్రతి ఉపాధ్యాయుడిని బహిష్కరించాలని పిలుపునిచ్చింది. అనేక మంది నీట్ విద్యార్థులు కోచింగ్ సెంటర్లలో చేరారు. దీంతో కోచింగ్ సెంటర్లకు కేవలం ఈ దేశంలోని విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి ఫీజులు వసూలు చేయడమే కావాలా? వారి భవిష్యత్ అక్కర్లేదా? విద్యార్థుల పోరాటం మీపోరాటం కాదా అని ప్రశ్నించింది.

# నీట్‌పై మోడీ కీలక వ్యాఖ్యలు



న్యూస్ డెస్క్, 21 జూలై (బిఎన్ఎస్): మంగళవారం ఉదయం ఢిల్లీలో ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొని దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న 'నీట్' పరీక్షల అక్రమాలు, పేపర్ లీకేజీ వ్యవహారంపై కీలక వ్యాఖ్యలు చేశారు. విద్యార్థుల ప్రయోజనాలే తమకు ప్రథమ ప్రాధాన్యమని, వారికి ఎలాంటి నష్టం కలగకుండా ఉండేందుకు ప్రభుత్వం త్వరితగతిన పరీక్షలు నిర్వహించి ఫలితాలు విడుదల చేసిందని తెలిపారు. పేపర్ లీకేజీలకు పాల్పడటం తీవ్రమైన నేరమని పేర్కొన్న ప్రధాని, విద్యార్థుల భవిష్యత్తు తో ఆడుకున్న తప్పు చేసిన వాళ్లను చట్టపరంగా శిక్షించేందుకు ఇప్పటికే కఠిన చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు.

ఈ కేసులో దోషులకు దేశంలోనే అత్యుత్తమ న్యాయవాదుల ద్వారా కఠినమైన శిక్ష పడేలా చేస్తామని, భవిష్యత్తులో ఎవరూ ఇలాంటి అక్రమాలకు పాల్పడకుండా ఇదొక ఉదాహరణగా నిలుస్తుందని ప్రధాని మోడీ వెల్లడించారు. అంతేకాకుండా, రాబోయే రోజుల్లో పరీక్షా పత్రాలు లీక్ కాకుండా పటిష్టమైన వ్యవస్థను రూపొందించడం మనందరి జాతీయ బాధ్యత అని వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు.

# వక్ఫ్ బోర్డుకు సుప్రీం ఊరట



న్యూస్ డెస్క్, 21 జూలై (బిఎన్ఎస్): కేరళ రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఎటువంటి కీలక విధానపరమైన (పాలసీ) నిర్ణయాలు తీసుకోకూడదని, క్యాపిటల్ వ్యయం చేయకూడదని కేరళ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సుప్రీంకోర్టు సవరించింది. కేరళ వక్ఫ్ బోర్డు దాఖలు చేసిన పిటిషన్‌పై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపి, హైకోర్టు విధించిన ఈ నిరోధాలను తొలగిస్తూ తీర్పు వెలువరించింది. వక్ఫ్ బోర్డు రోజువారీ, ప్రాథమిక విధులను అడ్డుకునేలా ఉన్న ఆంక్షల అవసరం లేదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

దీంతోపాటు, బోర్డు కార్యకలాపాలన్నీ ప్రభుత్వ జాయింట్ సెక్రటరీ నిశిత పర్యవేక్షణలోనే సాగాలంటూ హైకోర్టు ఇచ్చిన నిబంధనను కూడా సుప్రీంకోర్టు రద్దు చేసింది. జాయింట్ సెక్రటరీ ఇప్పటికే బోర్డు సభ్యునిగా ఉన్నందున ఆయన తన పాత హోదాలోనే కొనసాగుతారని వెల్లడించింది. ఈ పిటిషన్‌పై కేరళ హైకోర్టు తదుపరి విచారణ జరపాల్సి ఉన్నందున, రెండు పక్షాలకు తగిన సమయమిచ్చి అఫిడవిట్లను స్వీకరించిన అనంతరం కేసును వేగంగా ముగించాలని కేరళ హైకోర్టుకు అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు విజ్ఞప్తి చేసింది.

# హస్తినలో హైటెన్షన్



న్యూస్ డెస్క్, 21 జూలై (బిఎన్ఎస్): దేశ రాజధాని ఢిల్లీలో పొలిటికల్ హీట్ తారాస్థాయికి చేరింది. ఇటీవల చోటుచేసుకున్న విద్యార్థుల నిరసనలు, పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీలు, తీవ్ర అవకతవకలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలు తీవ్ర స్థాయిలో నిరసనకు దిగారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసం నుంచి ప్రధాని నరేంద్ర మోడీ అధికారిక నివాసం వైపు కాంగ్రెస్ నేతలు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. అయితే, ర్యాలీగా వెళ్లిన కాంగ్రెస్ ఎంపీలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు పలువురు సీనియర్ నాయకులు ప్రధాని నివాసం ఎదుటే రహదారిపై బైఠాయించి ధర్నా చేపట్టారు. మోదీ ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రధాని నివాస ప్రాంతం అంతా.. 'తానాషాహీ నహీ చలేగీ', 'మోదీ ఇస్తీఫా దో' అనే నినాదాలతో హోరెత్తుతోంది. విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం ఆటలాడుతోందని, పరీక్షల నిర్వహణలో వరుసగా జరుగుతున్న అక్రమాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు.

కర్ణాటక మాజీ సీఎం జోరు..

అయితే, ప్రధాన మోడీ నివాసం ముట్టడి కార్యక్రమంలో స్పెషల్ ఎట్రాక్షన్‌గా కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నిలిచారు. ఆయన పలువురు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల నేతలు, ఎంపీలు, పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు హాజరై వారిలో ఉత్సాహం నింపుతూ సంఘీభావం తెలిపారు.

# మన ఇల్లు - మన లోకేశ్



న్యూస్ డెస్క్, 21 జూలై (బిఎన్ఎస్): మన ఇల్లు - మన లోకేశ్ పేరుతో నిర్వహించిన ఇళ్లపట్టాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో 3 వేలమందికి మంత్రి లోకేశ్ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. నిరుపేదలకు రూ.1000 కోట్ల విలువైన ఆస్తిని ఇళ్ల పట్టాల రూపంలో ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. శాశ్వత భూ పట్టాతో పేదల ఆస్తిని ఎవ్వరూ కదిలించలేరన్నారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెద్దుల్లా తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. 2019 ఎన్నికల్లో తాను ఓడిపోయినపుడు.. తన తండ్రి చంద్రబాబును కూడా కొందరు అవహేళన చేశారని గుర్తుచేసుకున్న మంత్రి.. ఆ కసితోనే మంగళగిరిని అభివృద్ధికి చిరునామాగా మారుస్తున్నానన్నారు. మంగళగిరి నియోజకవర్గాన్ని దేశంలోనే నంబర్ వన్ నియోజకవర్గంగా మార్చి చూపిస్తానని మంత్రి నారా లోకేశ్ చాలెంజ్ చేశారు. ఇప్పటికే డ్రైనేజీ పనులు చేపట్టామని, త్వరలోనే మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతామని వెల్లడించారు.

# భగ్గుమన్న రైతాంగం



న్యూస్ డెస్క్, 21 జూలై (బిఎన్ఎస్): భారత్ - అమెరికా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని తీవ్రంగా నిరసిస్తూ పంజాబ్, హర్యానా సహా పలు రాష్ట్రాల రైతులు చేపట్టిన "ఢిల్లీ చలో" మార్చ్ పంజాబ్-హర్యానా సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. పంజాబ్‌లోని పాటియాలా వైపు నుండి వేలాదిగా శంభూ బార్డర్‌కు చేరుకున్న రైతులను హర్యానా పోలీసులు అడ్డుకున్నారు. ఢిల్లీలోని 'కిసాన్ ఘాట్' వద్ద నిర్వహించ తలపెట్టిన మహా పంచాయత్‌కు వెళ్లకుండా వంతెనలపై భారీ సిమెంట్ దిమ్మెలు, ముళ్లకంచెలతో కాంక్రీట్ బారికేడ్లు ఏర్పాటు చేసి, వాటర్ కేనన్లతో పోలీసు దళాలను భారీగా మోహరించారు.

అమెరికాతో ప్రతిపాదిస్తున్న ఈ ఒప్పందం వల్ల అక్కడి చవకైన డెయిరీ, వ్యవసాయ ఉత్పత్తులు భారత మార్కెట్‌లోకి దిగుమతి అయి, దేశీయ పశుపోషకులు, చిన్న తరహా రైతుల జీవనోపాధి తీవ్రంగా దెబ్బతింటుందని రైతు సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. తమను ఢిల్లీకి వెళ్లకుండా అడ్డుకోవడంపై రైతు నేతలు మండిపడుతుండగా, ముందస్తు జాగ్రత్తగా ఢిల్లీ పోలీసులు సైతం సరిహద్దుల్లో భారీగా భద్రతను పెంచి ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఇప్పటికే సీజేపీ నిరసనలతో జంతర్ మంతర్ ఉద్రిక్తంగా మారగా.. వీరికి తోడుగా రైతుల నిరసనలు చేరితో హింసాత్మకంగా మారే అవకాశం ఉన్నట్లు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# ఢిల్లీ విధ్వంసంపై కేసు నమోదు

మొదటి పేజీ తరువాయి



చర్యలపై కానాట్ ప్లేస్, పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్లలో భారతీయ న్యాయ సంహిత లోని వివిధ తీవ్రమైన సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఈ అల్లర్లలో స్పెషల్ కమిషనర్ స్థాయి సీనియర్ ఐపీఎస్ అధికారితో సహా 118 మందికి పైగా పోలీస్ సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారని, 60 మంది నిరసనకారులు గాయపడగా, హింసకు పాల్పడిన 70 మందిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీసులు పదేపదే హెచ్చరించినా వినకుండా, నిరోధాజ్ఞలను ఉల్లంఘించి ఆందోళనకారులు దౌర్జన్యానికి పాల్పడ్డారని ప్రకటన విడుదల చేస్తూ.. కానాట్ ప్లేస్ వద్ద రాళ్లదాడికి సంబంధించిన వీడియో ఫుటేజ్‌ను కూడా పోలీసులు విడుదల చేశారు. సామాజిక మాధ్యమాల్లో వ్యాపిస్తున్న తప్పుడు ప్రచారాలు, అసత్య కథనాలను ఎవరూ నమ్మవద్దని, కేవలం అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించి నగరంలో శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలని ఢిల్లీ పోలీస్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా విజ్ఞప్తి చేసింది. ప్రస్తుతం సీసీటీవీ ఫుటేజ, డిజిటల్ ఆధారాల సహాయంతో అల్లర్లకు కారణమైన వారిపై తదుపరి విచారణ కొనసాగుతోంది.

# టన్నెల్‌లో ఘోర ప్రమాదం



న్యూస్ డెస్క్, 21 జూలై (బిఎన్ఎస్): నిర్మాణంలో ఉన్న జల విద్యుత్ ప్రాజెక్ట్ సొరంగం కొండచరియలు విరిగిపడి కూలిపోయిన విషాద సంఘటన సిక్కింలోని నామ్చి జిల్లా సమర్దుంగ్ పరిధిలో చోటు చేసుకుంది. ఉదయం నుంచి రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతుండగా.. మృతుల సంఖ్య 10 కి చేరుకుంది. నేషనల్ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న తీస్తా స్టేజ్-4 జల విద్యుత్ ప్రాజెక్టులోని 'ADIT-3' టన్నెల్ హఠాత్తుగా కుప్పకూలడంతో ఈ ప్రమాదం జరిగింది. సోమవారం ప్రమాదం జరిగిన సమయంలో ప్రాజెక్ట్ అధికారులు, కార్మికులు సహా మొత్తం 25 మంది సొరంగం లోపల చిక్కుకుపోయినట్లు అధికారులు వెల్లడించారు.

ఘటనా స్థలంలో ఎన్డీఆర్ఎఫ్, పోలీస్, రెస్క్యూ బృందాలు గాలింపు చర్యలను ముమ్మరంగా కొనసాగిస్తున్నాయి. ఇప్పటివరకు 10 మృతదేహాలను వెలికి తీసినట్లు నామ్చి జిల్లా అధికారులు ధ్రువీకరించారు. సొరంగంలో ఇంకా మిగిలిన వారిని కాపాడేందుకు సహాయక చర్యలు కొనసాగుతుండటంతో, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈ విషాద ఘటనపై ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ సహా ఇతర కేంద్ర మంత్రులు స్పందిస్తూ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దురదృష్టకర ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు తన తీవ్ర సంతాపాన్ని ప్రకటించి, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఎక్స్‌గ్రేషియా ప్రకటన

ఈ ఘోర ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి రూ. 2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందిస్తామని ప్రధాని కార్యాలయం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా వెల్లడించింది. అలాగే తీవ్రంగా గాయపడిన బాధితులకు రూ. 50,000 చొప్పున సహాయం అందించనున్నట్లు స్పష్టం చేశారు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే కేంద్ర హోంమంత్రి అమిత్ షా సిక్కిం ముఖ్యమంత్రి ప్రేమ్ సింగ్ తమాంగ్‌తో ఫోన్‌లో మాట్లాడి సహాయక చర్యల గురించి ఆరా తీశారు. టన్నెల్‌లో చిక్కుకున్న వారిని కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం, ఎన్డీఆర్ఎఫ్ బృందాల ద్వారా అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని అమిత్ షా హామీ ఇచ్చారు.

# 4 వేల ఏళ్ల చారిత్రక వైభవం



న్యూస్ డెస్క్, 21 జూలై (బిఎన్ఎస్): రాష్ట్రంలోని మరో పురాతన చారిత్రక కట్టడానికి యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో గుర్తింపు దక్కే అవకాశం ఉంది. 2021లో రామప్ప ఆలయానికి ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు దక్కింది. అలాగే నారాయణపేట జిల్లా కృష్ణ మండలం ముడుమాల్ గ్రామంలో సుమారు నాలుగేళ్ల నాటి నిలువురాళ్ల(మెగాలిథిక్ యుగం)కు గతేడాది మార్చిలో ఆ జాబితాలో చోటుదక్కింది. ఇక్కడి రాళ్లకు ఖగోళ, పురాతన చారిత్రిక, సాంస్కృతిక ప్రాముఖ్యం ఉంది. రాతి నిర్మాణాల్లో ఓ పెద్ద బండరాయిపై ఆకాశంలోని నక్షత్రాలను(సప్తర్షి మండలం, సింహ రాశి వంటివి) పోలిన గుర్తులు చెక్కి ఉన్నాయి. దక్షిణాసియాలో ఇలాంటి నక్షత్రాల పటం లభించడం ఇదే తొలిసారి అని చరిత్రకారులు తెలిపారు. 80 మెన్హిర్ లు 80 ఎకరాల విస్తీర్ణంలో 10 నుంచి 14 అడుగుల ఎత్తులో ఉన్నాయి. ఇంగ్లాండ్‌లోని ప్రసిద్ధ స్టోన్‌హెంజ్ తరహాలోనే ఇక్కడి రాళ్లను ఆది మానవులు సూర్యోదయం, సూర్యాస్తమయం, నక్షత్రాలు, సూర్య, చంద్రగ్రహణాలు, ఖగోళ అంశాలను గుర్తించేందుకు ఈ రాళ్లను ఉపయోగించారని చరిత్రకారులు పేర్కొంటున్నారు. ఈ రాళ్లను స్థానికులు నీలరాళ్ల తిమ్మప్ప అని పిలుస్తూ పవిత్రంగా పూజిస్తారని, ఓ పెద్దరాయిని ఎల్లమ్మ తల్లిగా కొలుస్తారని అధికారులు వివరించారు. ముడుమాల్ రాతి కట్టడాలను ప్రపంచ వారసత్వ శాశ్వత జాబితాలోకి చేర్చేందుకు రాష్ట్ర పర్యాటక, వారసత్వశాఖతో పాటు దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ సైతం పనిచేస్తోందని ప్రభుత్వవర్గాలు తెలిపాయి.

తవ్వకాలకు ఏఎస్ఐ అనుమతి

ముడుమాల్ లో తవ్వకాలకు భారత పురావస్తుశాఖ అనుమతిచ్చిందని అధికారులు తెలిపారు. ఈ తవ్వకాల్లో వెలుగు చూసే వస్తువులు, ప్రాచీనంగా వాడిన పరికరాలు బయటపడితే ఎంతో చరిత్ర బయటికొస్తుందని దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ వేదకుమార్ తెలిపారు. మరోవైపు జిల్లా అధికారులు ముడుమాల్ అంశంపైన ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఆ ప్రాంతాన్ని పరరక్షించుకునే చర్యలు తీసుకోవడంతో పాటు యునెస్కో శాశ్వత గుర్తింపు కోసం కార్యాచరణ తీసుకుంటున్నారని ఆయన వివరించారు.

# రెబల్స్‌కు నో ఎంట్రీ



న్యూస్ డెస్క్, 21 జూలై (బిఎన్ఎస్): తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి మమతా బెనర్జీ తిరుగుబాటు (రెబల్) నేతలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పార్టీకి ద్రోహం చేసి వెళ్లిన వారిని తిరిగి చేర్చుకునే ప్రసక్తే లేదని ఆమె తేల్చిచెప్పారు. మంగళవారం కోల్‌కతాలో జరిగిన పార్టీ వార్షిక 'అమరవీరుల దినోత్సవ' సభలో ఆమె ప్రసంగించారు.

బీజేపీపై పోరాటానికి పిలుపు

పశ్చిమ బెంగాల్‌లో బీజేపీని ఓడించేందుకు 'ఇండియా' కూటమిలోని పార్టీలన్నీ ఏకం కావాలని మమత కోరారు. తనకు ఎలాంటి అహంకారం లేదని, విభేదాలను పక్కనపెట్టి అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. అలాగే, నీట్ పేపర్ లీక్‌పై జరుగుతున్న సీజేపీ ఆందోళనకారులకు తమ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. అవసరమైతే తాను కూడా ఆందోళనలో పాల్గొంటానన్నారు. సభా వేదికను బీజేపీ గూండాలు ధ్వంసం చేశారని, కరెంట్, మైకులు కట్ చేసి బాధిత కుటుంబాలను సభకు రాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ మమత సోమవారం రాత్రి వేదిక వద్దే బస చేశారు. అయితే బీజేపీ ఈ ఆరోపణలను ఖండించింది.

అభిషేక్ బెనర్జీ సవాల్

రెబల్ నేతలు పోలీసు కేసుల నుంచి తప్పించుకునేందుకు బీజేపీ ఇచ్చిన స్క్రిప్ట్ చదువుతున్నారని టీఎంసీ ఎంపీ అభిషేక్ బెనర్జీ విమర్శించారు. దమ్ముంటే వారు తిరిగి మమత వద్దకు రావాలని, వారు వస్తే తాను గంటలోపు పార్టీకి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. 2024 విజయాల్లో తన పాత్ర కూడా ఉందని ఆయన గుర్తుచేశారు. కాగా, బెంగాల్‌లో టీఎంసీ 15 ఏళ్ల పాలనకు బీజేపీ తెరదించడం, పార్టీలో భారీ చీలికల నేపథ్యంలో ఈ సభలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. సుఖేందు శేఖర్ రాయ్, సుస్మితా దేవ్ తదితర సీనియర్ నేతలు ఇప్పటికే పార్టీని వీడగా.. సుమారు 20 మంది ఎంపీల రెబల్ వర్గం ఎన్డీయేకు మద్దతు తెలిపే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

# ఆదాయానికి అండ!

మొదటి పేజీ తరువాయి

రాబడి తగ్గుతున్న తీరుపై ఆరా తీసిన సందర్భంగా.. అధికారుల నిర్లక్ష్యం, సిబ్బంది అక్రమాల వల్లే ఖజానాకు విపరీతమైన నష్టం జరుగుతోందని అధికారులు ప్రాథమిక నివేదికలు ఉంచారు. ముఖ్యంగా వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, గనులు, భూగర్భ వనరులు, పౌర సరఫరాలు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల వంటి కీలక శాఖల్లో భారీగా లీకేజీలు జరుగుతున్నట్లు ప్రభుత్వం స్పష్టమైన ఆధారాలు సేకరించింది.




పన్నుల ఎగవేత, అక్రమ రవాణా, నకిలీ రిజిస్ట్రేషన్లు, మైనింగ్ దోపిడీ వంటి చర్యల ద్వారా కొందరు వ్యాపారులు, అధికారులు కుమ్మక్కై ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ప్రస్తుతం ప్రతి శాఖలోనూ అంతర్గత విజిలెన్స్, తనిఖీ విభాగాలు ఉన్నప్పటికీ అవి కేవలం నామమాత్రంగానే పనిచేస్తున్నాయని సమీక్షలో తేలింది. పైగా సంబంధిత శాఖల అధికారులే ఆ విజిలెన్స్ విభాగాల్లో ఉండటంతో తమ సహచర అధికారుల అవినీతిని చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే బలమైన ఆరోపణలు ఉన్నాయి.

ఈ వ్యవస్థాగత లోపాలను పూర్తిగా ప్రక్షాళన చేయాలంటే అన్ని ఆదాయ శాఖలకు అతీతంగా స్వతంత్రంగా పనిచేసే ఒక నిఘా వ్యవస్థ వ్యవస్థితం కావాలని ప్రభుత్వం భావించింది. ఏ శాఖ పరిధిలోని అక్రమమైనా నేరుగా దాడి చేసి, చట్టపరమైన చర్యలు తీసుకునేలా ఈ కొత్త ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్‌ను ఏర్పాటు చేయాలని డిసైడ్ అయ్యారు. ఈ విభాగానికి ఐపీఎస్ లేదా ఐఏఎస్ స్థాయికి చెందిన సీనియర్ అధికారిని అధిపతిగా నియమించే అవకాశాలు ఉన్నాయి. అలాగే అంతర్గత తనిఖీలతో పాటు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పన్నుల వసూళ్లను నిరంతరం పర్యవేక్షించనున్నారు.

ఈ ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి సంబంధించిన ముసాయిదా ప్రణాళికలను త్వరితగతిన రూపొందించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. దీనికి ఎంతమంది సిబ్బంది అవసరమవుతారు, చట్టపరంగా ఎలాంటి ప్రత్యేక అధికారాలు కల్పించాలి, పోలీసు శాఖతో అనుసంధానం ఎలా ఉండాలి అనే అంశాలపై వారం రోజుల్లోగా సమగ్ర నివేదికను సిద్ధం చేయాలని సూచించారు. వచ్చే వారం నిర్వహించనున్న తదుపరి ఉన్నత స్థాయి సమావేశంలో ఈ ప్రతిపాదనలపై చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఈ వ్యవస్థ అందుబాటులోకి వస్తే రాష్ట్ర ఖజానాకు ఏటా వేల కోట్ల రూపాయల అదనపు ఆదాయం సమకూరే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు.

## త్వరలో వేలాదిమందితో

# ఇంటి గర్జన




రాజమండ్రి,(బిఎన్ఎస్) జూలై 21: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి దగ్గరగా మూడు సంవత్సరాలు కావస్తున్న ఇప్పటికి పేద ప్రజలకు అర్బన్ ప్రాంతంలో రెండు సెంట్లు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి ప్రభుత్వం తాత్సారం చేస్తుందని ఇది సిగ్గుచేటు అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య మండిపడ్డారు . కార్మిక లోకానికి మీరేనా ఇళ్ల స్థలాలు ఇవ్వాలని లేకుంటే భూ పోరాటం ద్వారా మేమే ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకుని పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు పంచి పెడతామన్నారు . ఈ సందర్భంగా జి ఈశ్వరయ్య మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా రాజమహేంద్రవరం మున్సిపల్ కార్మికులు ఈ స్థలాన్ని కార్మిక లోకానికి ఇవ్వాలని కోరుతున్న ప్రభుత్వం నాన్చుడు ధోరణి అవలంబిస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాదిమంది పేదలు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు చేసుకున్నారని ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇళ్ల స్థలాలు,రేషన్ కార్డులు ఇవ్వడం మర్చిపోయిందన్నారు .కనీసం టిడ్కో గృహాలపై చిత్తశుద్ధి లేదని ఆయన ఆరోపించారు.నవంబర్ నెలలో వేలాది మందితో ఇంటిగర్జన పేరుతో చలో విజయవాడ పిలుపునిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వాన్ని తాడోపేడో తేల్చుకుంటామని ఆయన హెచ్చరించారు..

## నేర పరిశోధన వేగవంతం కావాలి



అమరావతి జులై 21.:: ఆర్థిక సైబర్ నేరగాళ్లను కట్టడి చేసే విధంగా పోలీస్ మరింతగా ఆధునీకరణ కావాలని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. విజయవాడలోని బి ఆర్ అంబేద్కర్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఫ్యూచర్-రెడీ ఏపీ పోలీస్ సమీక్ష సమావేశంలో పాల్గొన్న అధికారులకు హోంమంత్రి దిశా నిర్దేశం చేశారు. గంజాయి,ఫ్యాక్షన్, భూకబ్జాలు సైబర్ నేరాలపై పోలీసులు మరింత వేగంగా స్పందించి నేరస్థులకు శిక్షపడేలా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.

2001లో అప్పటి ముఖ్యమంత్రి, ప్రస్తుత ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించిన పోలీసు సంస్కరణల రిట్రీట్ సంప్రదాయాన్ని 25 సంవత్సరాల అనంతరం అదే దూరదృష్టి, అదే సంస్కరణల స్ఫూర్తితో పునరుద్ధరించడం చారిత్రాత్మకమని హోంమంత్రి పేర్కొన్నారు. భవిష్యత్ సవాళ్లను ముందుగానే అంచనా వేసి పోలీసు వ్యవస్థను సిద్ధం చేయడమే ఈ రిట్రీట్ ప్రధాన లక్ష్యమని వివరించారు.

రాష్ట్ర ప్రభుత్వం, ప్రజల తరపున ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్న పోలీసు ఉన్నతాధికారులు, డీజీపీ కార్యాలయం, జిల్లా ఎస్పీలు, పోలీసు సిబ్బందిని ఆమె అభినందించారు. క్షేత్రస్థాయిలో పోలీసులు చేస్తున్న సేవలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

## వరస బైక్ చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు మైనర్లు అరెస్ట్: 7 వాహనాలు స్వాధీనం



చందానగర్, జూలై 21: చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వరుస ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు బాల నేరస్థులను పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ రోజు (21-07-2026) తెల్లవారుజామున లింగంపల్లి రైల్వే స్టేషన్ రోడ్డులో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వీరిద్దరినీ అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. నిందితుల నుంచి 7 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు సైబరాబాద్ పరిధిలోని చందానగర్, ఐడీఏ బొల్లారం, జగద్గిరిగుట్ట, మియాపూర్, బాచుపల్లి పోలీస్ స్టేషన్లలో నమోదైన మొత్తం 7 చోరీ కేసులను పోలీసులు ఛేదించారు.

మైనర్లు ఇచ్చిన స్వచ్ఛంద ఒప్పుకోలు వాంగ్మూలం ఆధారంగా వారు దాచిపెట్టిన చోట్ల నుంచి స్వాధీనం చేసుకున్న వాహనాలతో పాటు నిందితులను ఎల్.బి.నగర్‌లోని జువెనైల్ జస్టిస్ బోర్డు ముందు హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు. బాల నేరస్థులను అబ్జర్వేషన్ హోమ్‌కు తరలించేందుకు నివేదిక సమర్పించారు. చందానగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ వి. జనయ్య ఆధ్వర్యంలో సమర్థవంతంగా దర్యాప్తు చేపట్టి, నిందితులను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన కానిస్టేబుళ్లు ప్రభాకర్, ఆది శ్రీనివాస్, గోపీకృష్ణ, రాజులను ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

ఈ సందర్భంగా చందానగర్ పోలీసులు ప్రజలకు పలు సూచనలు చేశారు. వాహనదారులు తమ ద్విచక్ర వాహనాలను ఎల్లప్పుడూ సురక్షిత ప్రదేశాల్లోనే పార్క్ చేయాలని, హ్యాండిల్ లాక్‌తో పాటు అదనపు భద్రతా లాక్‌లను తప్పనిసరిగా ఉపయోగించాలని కోరారు. పరిసర ప్రాంతాల్లో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపించిన వెంటనే అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్లకు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.




# విద్యతోనే ఉజ్వల భవిత

### సంక్షేమ హాస్టళ్లలో వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం-సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

నెల్లూరు జిల్లా పొదలకూరు(బిఎన్ఎస్):-నెల్లూరు జిల్లా పొదలకూరులోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహంలో విద్యార్థులకు మాజీమంత్రి సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి చేతుల మీద ట్రంకుపెట్టెలు, ప్లేట్లు, గ్లాసులు, బెడ్ షీట్లు, కార్పెట్లు, టవళ్లు, స్వెటర్లు తదితర వస్తువుల పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ

కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ స్కూళ్లు, హాస్టళ్లలో వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యమిస్తోంది అని సర్వేపల్లి నియోజకవర్గంలో హాస్టళ్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ నిదులతో పాటు సీఎస్ఆర్ పండ్ కూడా వినియోగిస్తున్నాం అని తెలిపారు.అదేవిధంగా SEIL సీఎస్ఆర్ నిధులతో పొదలకూరులో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయించాం అని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు హాస్టళ్లు, స్కూళ్ల ఆవరణలోనూ లైట్లు ఏర్పాటు చేయించడం సంతోషం ఉంది అని బాలికల వసతిగృహం ఆవరణలో కిసాన్ క్రాఫ్ట్ సంస్థ 14 మరుగుదొడ్లను నిర్మించింది అని తెలిపారు.అదేవిధంగా నియోజకవర్గ వ్యాప్తంగా హాస్టళ్ల మరమ్మతులకు రూ.78 లక్షలు మంజూరు చేయించాం అని గొలగమూడి బీసీ గురుకులంలో ఈ విద్యాసంవత్సరం నుంచి జూనియర్ కళాశాల ప్రారంభించుకున్నాం అని తెలిపారు. అదేవిధంగా

పొదలకూరు ఎస్సీ హాస్టల్ నిర్మాణానికి రూ.3 కోట్లతో ప్రతిపాదనలు పంపాం అని జిల్లా మినరల్ ఫండ్ రూ.9 లక్షలతో ప్రహరీ నిర్మించాం అని తెలిపారు. వసతి గృహాల నిర్మాణం, వసతుల కల్పన కోసం ఇప్పటి వరకు 4.60 కోట్లు మంజూరుకాగా, మరో 7 కోట్లతో ప్రతిపాదనలు పంపాం..అందులో రూ.3 కోట్లు మంజూరుకు సిద్ధంగా ఉన్నాయి అన్నారు.అదేవిధంగా సర్వేపల్లి నియోజకవర్గంలో త్వరలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తున్నా అని విద్యార్థులందరూ అవకాశాలను సద్వినియోగం చేసుకుని బాగా చదివి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలి అని తెలిపారు.





# మత్తు పదార్థాలపై ఈగల్ టీమ్ ఉక్కుపాదం

### డాగ్ స్క్వాడ్‌తో పాఠశాల సమీపంలోని దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

బిఎన్ఎస్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం, జూలై 21: కామారెడ్డి జిల్లా ఈగల్ టీమ్ ఆధ్వర్యంలో మంగళవారం పిట్లంలోని ప్రభుత్వ పాఠశాల సమీపంలోని కిరాణా, పాన్ దుకాణాల్లో డాగ్ స్క్వాడ్‌తో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల అక్రమ విక్రయాలను అరికట్టే లక్ష్యంతో ఈ సోదాలు చేపట్టారు. మత్తు పదార్థాల విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. అక్రమ కార్యకలాపాలపై ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# తృటిలో తప్పిన పెను ప్రమాదం




అంతర్వేది (బిఎన్ఎస్) జూలై 21 : కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం, అంతర్వేది తీర ప్రాంతంలో పెను ప్రమాదం తృటిలో తప్పింది. పరిమితికి మించి ప్రయాణికులతో సముద్రంలోకి వెళ్లిన ఓ స్పీడ్ బోట్ మధ్యలోనే నిలిచిపోవడంతో అందులోని పర్యాటకులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. కొంతసేపు అలల మధ్య ప్రాణభయంతో గడిపిన పర్యాటకులు సురక్షితంగా ఒడ్డుకు చేరుకోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

అంతర్వేది తీర ప్రాంతంలోని షిప్పింగ్ యార్డు వద్ద ప్రైవేటు సంస్థ స్పీడ్ బోట్లను నిర్వహిస్తున్నట్లు సమాచారం. అయితే సంబంధిత శాఖల అనుమతులు,కనీస అనుభవం లేకుండానే ఒక ప్రైవేటు సంస్థకు చెందిన బోట్లను నడుపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బోట్ల నిర్వహణకు అవసరమైన ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, బీమా, డ్రైవర్లకు చెల్లుబాటు అయ్యే లైసెన్సులు ఉన్నాయా లేదా అన్నదానిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో తీర ప్రాంతాల్లో బోట్ల నిర్వహణకు నిర్దిష్ట నిబంధనలు అమల్లో ఉన్నాయి. అలాగే నదీ మార్గాల్లో బోట్ల రాకపోకలకు ఇరిగేషన్ శాఖ నుంచి రూట్ మ్యాప్ అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. రాష్ట్ర అంతర్గత జలరవాణా సంస్థ నుంచి సంబంధిత సర్టిఫికెట్లు పొందడం కూడా తప్పనిసరి. అయినప్పటికీ కొన్ని బోట్లు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశమవుతున్నాయి.

ఇటీవల సముద్రంలో నిలిచిపోయిన స్పీడ్ బోట్‌లో ప్రయాణికుల సంఖ్య కూడా పరిమితికి మించి ఉన్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా కొందరు బోట్ డ్రైవర్లకు లైసెన్సులు లేకపోవడం, ప్రమాద సమయంలో సహాయక చర్యలకు అవసరమైన రెస్క్యూ బోట్ అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వ అనుమతులు లేకపోయినా కొందరు అధికారుల కనుసన్నల్లోనే బోట్ల నిర్వహణ జరుగుతోందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పర్యాటకుల ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉన్నందున సంబంధిత శాఖల అధికారులు వెంటనే సమగ్ర విచారణ చేపట్టి, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

మరోవైపు, ఈ ఘటనపై సంబంధిత శాఖల అధికారుల వివరణ రావాల్సి ఉంది. బోట్లనిర్వహణకు సంబంధించిన అన్ని అనుమతులు, భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా అన్న అంశాలపై అధికారికంగా స్పష్టత రావాలి .

## పిట్లం శివాలయంలో అన్నదానం కార్యక్రమం

### వర్షాలు కురవాలని బతుకమ్మ ఆడిన మహిళలు



బిఎన్ఎస్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా: కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలో శివాలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మంచి వర్షాలు కురిసి రైతుల పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షిస్తూ మహిళలు మంగళవారం బతుకమ్మ ఆడారు. సకాలంలో వర్షాలు కురిసి చెరువులు, కుంటలు నిండాలని, ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. వేడుకల్లో మహిళలు పాల్గొని తెలంగాణ సంప్రదాయ సంస్కృతిని చాటిచెప్పారు. గ్రామ పెద్దలు గ్రామస్తులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## గుంతలమయమైన సిద్ధాపూర్ రహదారి

### వాహనదారులకు నరకయాతన



బిఎన్ఎస్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా: కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని సిద్ధాపూర్ శివారు అటవీ ప్రాంతంలో రహదారి పూర్తిగా గుంతలమయమైంది. కొద్దిపాటి వర్షానికే గుంతలు నీటితో నిండిపోయి చెరువును తలపిస్తున్నాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే రహదారికి మరమ్మతులు చేపట్టి ప్రయాణానికి అనుకూలంగా మార్చాలని వాహనదారులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

## ముడి పొగాకుపై జీఎస్టీ 40 శాతం నుంచి 28 శాతానికి తగ్గించాలి

### - కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు రాష్ట్ర మంత్రులు, ఎంపీల వినతి



న్యూఢిల్లీ, జూలై 21: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, సహచర మంత్రులు, ఎంపీలతో కలిసి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ని పార్లమెంట్ లో కలిసి ముడి పొగాకు (నూచీ 2401)పై ప్రస్తుతం అమలులో ఉన్న 40 శాతం జీఎస్టీని 28 శాతానికి తగ్గించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లి, రైతుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇది కేవలం ముడి పొగాకు (నూచీ 2401)కు సంబంధించిన అంశమని, తయారైన పొగాకు ఉత్పత్తులకు దీనికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. జీఎస్టీ పెంపు కారణంగా రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న ఖీజ౦ పొగాకు విలువపై తీవ్ర ప్రభావం పడుతున్న నేపథ్యంలో, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని జీఎస్టీని 40 శాతం నుంచి 28 శాతానికి తగ్గించాలని కోరారు. ఈ నిర్ణయం ద్వారా పొగాకు రైతులు, డీలర్లు, ఎగుమతిదారులకు ఉపశమనం లభించడంతో పాటు అంతర్జాతీయ మార్కెట్లో భారత పొగాకు ఎగుమతుల పోటీతత్వం మరింత మెరుగుపడుతుందని తెలిపారు. ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, త్వరితగతిన తగిన నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర మంత్రులు, ఎంపీలు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. ఈ కీలక సమావేశంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస రాజు, ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, పార్లమెంట్ సభ్యులు దగ్గుబాటి పురంధేశ్వరి, లావు శ్రీకృష్ణదేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడు, మాగుంట శ్రీనివాసులు రెడ్డి, బస్తీపాటి నాగరాజు, బీద మస్తాన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మంగారిమఠం పాత గురుకుల పాఠశాలను పునరుద్ధరించాలి.

### ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు కలసి ఎమ్మెల్యే పుట్టాకు వినతి



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా జూలై 21: బ్రహ్మంగారి మఠం మండల కేంద్రంలోని ఏళ్ల చరిత్ర ఉన్న అంబేద్కర్ గురుకుల పాఠశాలను యధాస్థానానికి తీసుకురావాలని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కు వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గండి సునీల్ కుమార్, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు సోమిరెడ్డి పల్లె అరవింద్ లు మాట్లాడుతూ.. బ్రహ్మంగారిమఠంలోని గురుకుల పాఠశాల ఎన్నో సంవత్సరాలుగా ఎంతోమంది పేద విద్యార్థులకు విద్యను అందించి ఎంతోమందిని ప్రయోజకులను చేసిందని, అలాంటి పాఠశాలను తోట్లపల్లికి తరలించడం జరిగిందని వారు తెలిపారు. నూతనంగా ఏర్పాటు అయిన మహా గురుకులంలో పరిమితికి మించి విద్యార్థులు ఉండడంతో అక్కడ విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారని వారు తెలిపారు. మండల కేంద్రంలో ఎన్నో ఏళ్ల చరిత్ర ఉన్న గురుకుల పాఠశాలను యధావిధిగా కొనసాగించేందుకు ఏర్పాట్లు చేయాలని వారు డిమాండ్ చేశారు. పాత స్కూల్ కు రక్షణ లేనందున వస్తువులన్నీ కూడా మాయమైపోతున్నాయని వారన్నారు. యధా స్థానానికి స్కూల్ తీసుకురావడం వల్ల మండలం డెవలప్మెంట్ అవుతుందని వారు అన్నారు. అనంతరం ఎమ్మెల్యే పుట్టా స్పందించి సెక్రెటరీకి కాల్ చేసి యధా స్థానానికి పాత స్కూల్ ను తీసుకురావాలని మండలంలో విద్యార్థులకు సమస్య రాకూడదని త్వరలోనే ఆ సమస్యకు పరిష్కారం కావాలని వారు సెక్రటరీకి తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు దేవా, డివైఎఫ్ఐ నాయకులు ఓబులేష్, రాజా తదితరులు పాల్గొన్నారు.

## పనుల్లో అలసత్వం వహిస్తే సహించను

### : సీఎం రేవంత్ రెడ్డి



బొంరాస్‌పేట,బిఎన్ఎస్: ఎడ్యుకేషన్ హబ్ పనుల్లో అలసత్వం వహిస్తే సాహించేది లేదని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను హెచ్చరించారు. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేట్ ఎడ్యుకేషన్ హబ్‌లో జరుగుతున్న పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. పనులు కాగితాల్లో కాకుండా చేతల్లో చూపించాలన్నారు. పనులు చేయని అధికారులను సస్పెండ్ చేయాలని ఆదేశించారు. తాను ప్రజలకు జవాబు చెప్పుకోవాలని, పురోగతి కనిపించకుంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రతి నెలా ప్రగతి పనులను ఇక్కడే ఉండి పర్యవేక్షణ చేస్తానని సీఎం అన్నారు. ప్రణాళిక ప్రకారం పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సీఎం వెంట ముఖ్య కార్యదర్శి శ్రీధర్, కలెక్టర్లు దీపక్ తివారి, ప్రియాంక, ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి ఉన్నారు.



# సినిమా న్యూస్

## బాలయ్యకు షూటింగ్‌లో గాయం



స్టార్ హీరో, నటసింహం నందమూరి బాలకృష్ణ ప్రమాదానికి గురయ్యారు. కాకినాడ పోర్ట్ ప్రాంగణంలో జరుగుతున్న తాజా చిత్రం షూటింగ్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్టైనర్ కోసం కాకినాడ పోర్ట్ పరిసరాల్లో కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. చిత్రీకరణ సమయంలో బాలకృష్ణ అనుకోకుండా కాలుజారి కిందపడిపోయారు. ఈ క్రమంలో ఆయన మోకాలికి స్వల్ప గాయమైంది. ప్రమాదాన్ని గమనించిన చిత్ర యూనిట్ సభ్యులు వెంటనే షూటింగ్‌ను నిలిపివేసి, ఆయనను చికిత్స నిమిత్తం సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

ఆందోళన అవసరం లేదన్న వైద్యులు..

ఆసుపత్రిలో వైద్యులు బాలకృష్ణకు ప్రాథమిక చికిత్స అందించి, ఇతర వైద్య పరీక్షలు నిర్వహించారు. గాయం స్వల్పమైనదేనని, కంగారు పడాల్సిన అవసరం లేదని వైద్యులు స్పష్టం చేశారు. కొన్ని రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని సూచించినట్లు తెలుస్తోంది. 'వీరసింహారెడ్డి' లాంటి బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత బాలకృష్ణ - గోపీచంద్ మలినేని కాంబినేషన్లో వస్తున్న రెండవ చిత్రం ఇది. శరవేగంగా జరుపుకుంటున్న ఈ కాకినాడ షెడ్యూల్లో భారీ యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరిస్తున్న సమయంలో ఈ అనుకోని ఘటన జరిగింది. బాలకృష్ణకు గాయమైందనే వార్త సోషల్ మీడియాలో వ్యాపించడంతో అభిమానులు, సినీ ప్రముఖులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆయన త్వరగా కోలుకుని, తిరిగి షూటింగ్‌లో పాల్గొనాలని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని, త్వరలోనే డిశ్చార్జ్ అయ్యే అవకాశం ఉందని సమాచారం.

## హాలీవుడ్‌ను చూసి నేర్చుకోండి

అక్కినేని అఖిల్ మూడేళ్ల గ్యాప్ తర్వాత వచ్చిన యాక్షన్ మూవీ 'లెనిన్'. మురళి కిషోరు అబ్బూరి దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా ఫస్ట్ డే నుంచి బాక్సాఫీసు వద్ద సూపర్ హిట్ టాక్‌ను దక్కించుకుంటోంది. మొదటి రోజు నుంచే భారీ కలెక్షన్స్ రాబడుతూ దూసుకెళ్తోంది. ఏజెంట్' పరాజయం తర్వాత అఖిల్‌కు ఈ రేంజ్ హిట్ రావడంతో అక్కినేని అభిమానులు పండగ చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన 'లెనిన్' సక్సెస్ మీట్‌లో నాగార్జున పాల్గొని టాలీవుడ్ చిత్రాల విడుదల తేదీలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హాలీవుడ్ చిత్రం 'ఒడిస్సీ' ఏడాది ముందే డేట్ ప్రకటించి సరిగ్గా అదే తేదీకి వచ్చిందని, కానీ మన దగ్గర రిలీజ్ డేట్స్ ఇచ్చినా సమయానికి సినిమాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

'లెనిన్' విషయంలోనూ ఇదే జరిగిందని, తాను జూన్ 26న విడుదల తేదీ ప్రకటించినప్పటికీ పోస్ట్ ప్రొడక్షన్ ఆలస్యం కావడంతో వాయిదా వేయాల్సి వచ్చిందని తెలిపారు. గతంలో 'నిన్నే పెళ్లాడతా', 'అన్నమయ్య' చిత్రాల కాపీలను నెల రోజుల ముందే చూసేవాళ్లమని, ఇప్పుడు ఎందుకు అలా చేయలేకపోతున్నామని ప్రశ్నించారు. ఒకప్పుడు తన 'నిన్నే పెళ్లాడతా', 'అన్నమయ్య' సినిమాల టైమ్‌లో.. రిలీజ్‌కు నెల రోజుల ముందే పూర్తి సినిమా రెడీగా ఉండేదని గుర్తుచేసుకున్నారు. "ఇప్పుడు ఎందుకు అలా ప్లాన్ చేసుకోలేకపోతున్నాం? సినిమా బాగుండాలన్నా, అందరూ ప్రశాంతంగా పనిచేయాలన్నా రిలీజ్‌కు కనీసం రెండు వారాల ముందే పనులన్నీ పూర్తి చేసి ఫైనల్ కాపీ రెడీగా ఉంచాలి" అని నాగార్జున కోరారు. ఇది కేవలం వేరే వాళ్ల కోసం మాత్రమే కాదని, తనతో సహా ఇండస్ట్రీలోని దర్శకులు, నిర్మాతలు అందరూ ఆలోచించుకోవాల్సిన విషయమని ఆయన చెప్పారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో సంచలనంగా మారాయి.



## తారాతో యష్ రొమాన్స్



రాకింగ్ స్టార్ యష్ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్-ఇండియా మూవీ 'టాక్సిక్'. ఈ సినిమా ఆగస్ట్ 26న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రాబోతోంది. విడుదల తేదీ దగ్గరపడుతుండటంతో మ్యూజికల్ జర్నీని ప్రారంభించిన చిత్రబృందం, వరుసగా పాటలను విడుదల చేస్తూ సినిమాపై క్యూరియాసిటీని పెంచేస్తోంది. ఇప్పటికే వచ్చిన మొదటి పాట 'తబాహి'తో బోల్డ్, రొమాంటిక్ వైబ్‌ను పరిచయం చేసిన టీమ్.. తాజాగా 'మనసు ఆగదు' అంటూ సాగే రెండో పాటను విడుదల చేసింది. ఈ రెండో పాటలో మొదటిదాన్ని మించిన తీవ్రమైన రొమాన్స్‌ను చూపించారు. బాలీవుడ్ బ్యూటీ తారా సుతారియా బాత్‌టబ్‌లో నగ్నంగా ఎంట్రీ ఇవ్వగా, అక్కడే ఉన్న యష్ ఆమెకు ప్రేమిస్తున్నట్లు చెప్పి గన్‌తో ఎంగేజ్‌మెంట్ రింగ్ తొడిగే సీన్ ఆకట్టుకుంటుంది. ఆ తర్వాత ఇద్దరూ ఒకే దుప్పటి కప్పుకుని వర్షంలో బాల్కనీలో సాగించే రొమాన్స్, కేఫ్‌లో అందరిముందే ముద్దులతో రెచ్చిపోయే సీన్స్ సాంగ్‌లో విపరీతంగా హైలైట్ అయ్యాయి. ప్రస్తుతం ఈ సాంగ్ వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. కాగా.. లేడీ డైరెక్టర్ గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న ఈ మోస్ట్ క్రేజీ ప్రాజెక్ట్‌లో నయనతార, కియారా అద్వానీ, రుక్మిణి వసంత్, తారా సుతారియా, హుమా ఖురేషి కీలక పాత్రలు పోషిస్తున్నారు. గ్యాంగ్‌స్టర్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న ఈ సినిమాకు విశాల్ మిశ్రా, కనిష్క్ బాగ్చి సంగీతం అందిస్తున్నారు. కెవిఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ఇక ఈ సెకండ్ సింగిల్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగిపోయాయి.

## ఆజాద్ హింద్ 'ఫౌజీ'?




పాత్ర చిత్రణ, కథ, కథనం.. ఈ మూడూ సినిమా విజయంలో ప్రధాన భూమిక పోషిస్తుంటాయి. వీటి విషయంలో దర్శకుడు అప్రమత్తంగా ఉంటే చాలు.. విజయం తథ్యం. దర్శకుడు హను రాఘవపూడి 'ఫౌజీ' చిత్రం విషయంలో ఈ జాగ్రత్తలన్నీ తీసుకుంటూ ముందుకెళ్తున్నారు. ఆయన గత విజయం 'సీతారామం' విషయంలోనూ ఇదే రీతిని అనుసరించారాయన. 'ఫౌజీ'లో ప్రభాస్ పాత్ర తీరుతెన్నుల గురించి ఆసక్తికరమైన వివరాలు ప్రస్తుతం వెలుగు చూశాయి. ఇందులో ప్రభాస్ సైనికుడిగా కనిపిస్తారని ముందునుంచీ చెబుతూనే ఉన్నారు.

అయితే.. కథ రీత్యా ముందు ఆయన బ్రిటీష్ ఇండియన్ ఆర్మీ సైనికుడిగా కనిపిస్తారట. ఆ తర్వాత నేతాజీ సుభాష్ చంద్రబోస్ 'అజాద్ హింద్ ఫౌజ్' స్థాపించడంతో నేతాజీ నేతృత్వంలో స్వాతంత్ర్య పోరాటం సాగించేందుకు తాను కూడా అజాద్ హింద్ ఫౌజ్‌లో చేరతాడట. భారత స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఓ సైనికుని కథగా ఈ సినిమా సాగుతుందని టాక్. ఇందులో ప్రభాస్ పాత్ర.. ధైర్య సాహసాలతో, త్యాగం, దేశభక్తితో నిండి ఉంటుందని వినికిడి. ఇమాన్వి కథానాయిక నటిస్తున్న ఈ చిత్రంలో అద్భుతమైన ప్రేమకథ కూడా ఉంటుందట. మైత్రీ మూవీమేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

## మారుతి మాస్టర్ ప్లాన్

టాలీవుడ్ స్టార్ డైరెక్టర్ మారుతి తనదైన కామెడీ ఎంటర్‌టైన్‌మెంట్ చిత్రాలతో కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకుంటూ ప్రత్యేకమైన గుర్తింపును రాబట్టుకున్నారు. ఇక ఇటీవల ఆయన తెరకెక్కించిన 'ది రాజాసాబ్' సినిమా భారీ అంచనాల మధ్య విడుదలైనప్పటికీ బాక్సాఫీసు వద్ద రాణించలేకపోయింది. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా నటించిన ఈ చిత్రం భారీ డిజాస్టర్‌గా నిలిచింది. దీంతో విమర్శలు వచ్చాయి. ఇక అప్పటినుంచి ఇండస్ట్రీకి కాస్త గ్యాప్ ఇచ్చారు మారుతి. ఈనేపథ్యంలో.. తాజాగా, మారుతికి సంబంధించిన ఒక ఆసక్తికరమైన వార్త సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతోంది. 'రాజాసాబ్' పరాజయం తర్వాత మారుతి తన నెక్స్ట్ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించేందుకు సిద్ధమైనట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా పరిమిత బడ్జెట్‌లో వినోదాత్మక కథను తెరకెక్కించేందుకు మారుతి ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం వరుణ్ తేజ్ నటించిన 'కొరియన్ కనకరాజు' సినిమా విడుదలకు సిద్ధంగా ఉండగా, దాని తర్వాత ఆయన చెల్లెలు నిహారిక కొణిదెల నిర్మిస్తున్న 'బరి' చిత్రంలో నటించనున్నారు. ఈ రెండు ప్రాజెక్టులు పూర్తయిన తర్వాత మారుతి - వరుణ్ తేజ్ కాంబినేషన్ సినిమా అధికారికంగా ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయని టాక్ . మరి వీరిద్దరి కాంబో సెట్ అయి మారుతి మళ్లీ బాక్సాఫీస్ వద్ద పవర్ ఫుల్ కంబ్యాక్ ఇస్తారో లేదో చూడాలి.



## విజయ్ ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్



తమిళనాడు ముఖ్యమంత్రి, దళపతి విజయ్ నటించిన జన నాయగన్ ఈనెల 23వ తేదీన రిలీజ్ కానుంది. రెండు రోజుల్లోనే ఈ సినిమా రిలీజ్ అవుతున్న నేపథ్యంలో ప్రమోషన్స్ వేగవంతం చేసింది చిత్రబృందం. ఈ నేపద్యంలో జన నాయగన్ సినిమా దర్శకుడు వినోద్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇది విజయ్ చివరి సినిమా కాదని.. ఈ విషయం ఎవరికీ కచ్చితంగా తెలియదంటూ బాంబు పేల్చారు. కానీ ముఖ్యమంత్రి విజయ్ సర్ తొలి చిత్రం అని చెప్పొచ్చు అని వెల్లడించారు. ఈ కేవలం కమర్షియల్ సినిమా కాదని.. విజయ్ సర్ ను గొప్పగా చూపించడం కోసం చేయలేదన్నారు. సెన్సిటివ్ పాలిటిక్స్ చుట్టూ కథ నడుస్తుందని వెల్లడించారు. అయితే విజయ్ చివరి సినిమా జన నాయగన్ కాదని దర్శకుడు వినోద్ చేసిన వ్యాఖ్యలు మాత్రం సోషల్ మీడియాలో షేక్ చేస్తున్నాయి. ముఖ్యమంత్రి హోదాలో కూడా విజయ్ మరో సినిమా చేస్తాడని జోరుగా ప్రచారం కూడా సాగుతోంది.